ఈ కారణంవల్లనే బుచ్చిరాజు బాలయ్యను చూసి తల దించుకున్నాడు. ఇప్పుడే కాక ఇంతకు మొదటగూడ ఎన్నో పర్యాయాలు బుచ్చిరాజుకు తటస్థపడ్డాడు. ఇతణ్ణిచూసి అతడు చలించలేదు. ఇతడే తలవాల్చి వెళ్ళిపోవాల్సి వచ్చింది. కారణం బుచ్చిరాజుకు తెలుసు. బాలయ్య తన ప్రవర్తనకు వణికిపోయింది క్షణ కాలం మాత్రమే ఆ ఘట్టం కాస్తా కళ్ళముందు నుంచి మాయమవగానే తనూ మర్చిపోయాడు. బుచ్చిరాజును ఈనాడతను గుర్తేపట్టడు. కాని బుచ్చిరాజు మాత్రం తన తప్పిదానికి ఈనాడు గూడా తలవంచుకుంటున్నాడు. బాలయ్యకూ, బుచ్చిరాజుకూ ఉన్న తేడా ఆత్మసంస్కారం లోనే.

త్వరత్వరగా ఇంటికివచ్చి బుచ్చిరాజు ఈజీ చైర్లో కూర్చున్నాడు. కాని అతని మనస్సు మనసులోలేదు. ఎందుకు తను అప్రయత్నంగా అలాంటి అవమానం ఫీలవుతాడు? బాలయ్య ఏనాడో మర్చిపోయినట్లుంది. కాని తననింత వరకూ పీడిస్తుందే ఆఘట్టం? తనూ, బాలయ్యమల్లే ఉంటే ఎంత బావుండును! 'ఛీ, ఛీ ఈ చదువూ, సంస్కారమూ లేకున్నా బావుండేది! అని మనసులో అనుకుంటూంటే వేడినిశ్వాసం ఒకటి వెలుపడింది.

కథానిక

# ఫలించిన పథకం

ఎస్. యం. సుభాని

అట్నుంచి వస్తున్న రాజారావు రౌండ్ గార్డెన్ లోని ఫౌంటెన్ దగ్గర నిలబడివున్న విజయ లక్ష్మిని చూశాడు. అంతకు క్రితం చాలాసార్లు చూశాడు, కాని పరిచయ మేర్పడిన తర్వాత ఇదే మొదటిసారిగా చూడటం. ఎప్పుడుచూసినా ఏదో విచారంతో బాధపడుతున్నట్లు కన్పిస్తుండేది. ఈ రోజు ఆమె ముఖాన విచారం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది. ఒక్కక్షణం ఆమెవైపు చూస్తూ నిల్చున్న రాజారావు మనసులో ఒక ఊహ మెరిసింది. ఎలాగైనా ఆమె విచారం పోగొట్టాలని నిశ్చయించుకొని గార్డెన్లో ప్రవేశించాడు.

ఆమెతో కేవలం ఒక్కసారిమాత్రం సమావేశంలో పరిచయమైనా, అతను ఎటువంటి సంకోచం లేకుండా ఆమెను సమీపించాడు. కొంతవరకు అతనిలోని సత్సంకల్పం అతనిని ముందుకు నెట్టింది.

“బాగున్నారా!” అని అడిగాడు రాజారావు.

“ఊఁ” అంటూ ఆమె అస్పష్ట మందహాసంతో తలఊపింది.

“అదోమాదిరిగా ఉన్నారు. ఒంట్లో బాగా లేదా?”

“ఏమీలేదండీ, కులాసాగానే వున్నాను” తల వంచుకుని సమాధానం చెప్పింది.

“ఎప్పుడు చూసినా ఏదో దిగులుగావుంటారు. అంతకన్నా నాలుగు రసగుళికలు పుచ్చుకో రాదూ?” నవ్వుతూ అన్నాడు రాజారావు.

“రసగుళికలు...” అంటే ఏమిటన్నట్లు ఆమె ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

“మరేంకాదు, ఉత్సాహంగా ఉండేందుకు డాక్టరుగారి నడిగి నాలుగు మోతాదుల ఆనంద రసం పుచ్చుకోరాదా?”-అని.

ఆమె మళ్ళా తలెత్తి రాజారావువైపు చూసింది. అతను చిరునవ్వు చిందిస్తున్నాడు... ఆమె కళ్ళలో కోపం, సిగ్గూ, రెండూ ప్రతిబింబించినై. రాజారావు ఇంకా మందహాసం చేస్తూనే వున్నాడు. ఆమె తలవంచుకున్నది.

పాలిపోయిన ఆమె చెక్కిళ్లు క్షణికంగా గులాబివర్ణం దాల్చటం రాజారావు స్పష్టంగా చూడకలిగాడు. అతనికి తన సత్సంకల్పం నెరవేరుతుందనే విశ్వాసం కలిగింది.

"నే నీవిధంగా చనువుతో మాట్లాడటం మీకు కష్టం కలిగిస్తే క్షమించాలి... మొన్న సమావేశంలో మీతో పరిచయమైనది. అంతకు క్రితం కూడా చాలాసార్లు చూశాను. ఎప్పుడు చూసినా ఏదో విచారంగా కన్పిస్తారు. మీ విషణ్ణ వదనం చూస్తు వుంటే ఎందుకనో ఒకమాదిరిగా వుంటుంది. మీకు ఈ విచారాన్ని పోగొట్టుకునే మార్గం ఏమీలేదా?" అతని స్వరం మృదువుగా అనునయపూర్వకంగా వున్నది.

"మీ మాటలవలన కష్టంకలిగే మాట నిజమే, నేను విచారంగా వున్నాననే అనుమానం ఎందుకు కలిగింది మీకు? ఒకవేళ విచారంగావున్నా అదెలా పోతుంది మరి?" అడిగిం దామె విచిత్రంగా నవ్వుతూ.

ఆమె మాటల తీరుచూస్తే రాజారావుకు కొంచెం ఆశ్చర్యం కలిగింది. ఆమెలో అత నను కున్నంత సంకోచం కన్పించలేదు.

"ఆ అనుమానం నాకు ఎందుకు కలిగిందో చెప్పటం ఎంత కష్టమో తెలిస్తే మీరా ప్రశ్న వేసేవారు కారు. మిమ్మల్ని చూసి చిన్నపిల్లవాడు కూడా చెప్పగలడు మీరు దిగులుగా వున్నారని. ఇక అది పోయే విధాన మంటారా, ఆ విచారం ఎందుకు ఏమిటో తెలుసుకోగలిగితే దానిని పోగొట్టుకోవచ్చు. కారణం తెలిస్తే దానికి తగిన చికిత్స చేసి నివారించటం కష్టంకాదు. మీ కీ విచారం ఎందుకో అడిగేపాటి సాహసం చేయ కలను కాని దానిని మీరు దుస్సాహసం అనుకుంటే మళ్ళా నేను చాలా బాధపడవలసి వస్తుంది."

విజయలక్ష్మి అతని మాటలకు సమాధానం చెప్పలేదు. ఉన్నట్లుండి ఆమె ముఖాన విచార రేఖలు వ్యాపించినై. ఆమె నిస్పృహతో బాధ పడుతుండేమోననే అనుమానం కలిగింది రాజా రావుకు. తను ఆలోచించిన ఉపాయంతో యెలా గైనా ఆమె విచారం పోగొట్టా లనుకున్నాడు.

"నాబోటివాడు చేయకలిగేదేమీ లేదు. కాని మీ విచారం పోయే మార్గం తెలిస్తే బాగుండును! ఇటువంటి కుతూహలం కలగటం సహజమే నని పిస్తుందేమో కాని ఇది వ్యర్థ కూతూహలంమాత్రం కాదు. టైం అయిపోవచ్చింది, వార్డు కెళ్ళండి. అదృష్టం బాగుంటే మళ్ళా మీ దర్శన భాగ్యం లభిస్తుంది...నమస్తే."

ఆమె సమాధానం చెప్పే అవకాశం లేకుం డానే వెళ్ళిపోయాడు రాజారావు. వెనక్కు కూడా తిరిగిచూడలేదు. అతను కన్పిస్తున్నంతసేపు అతనిని చూస్తూ నిలబడిం దామె.

విజయలక్ష్మి ఆలోచించింది—ఆమెను దిగులు పడవద్దని చాలామందిచెప్పారు. చెప్తూనేవున్నారు. అస లామె దిగులుపడుతుందనే సంగతి నిజమో అబద్ధమో కూడా నిర్ధారించుకోలేక పోయింది. ఒకవేళ దిగులుపడుతున్నమాట నిజమే అయితే ఆ దిగులు దేనిగురించో ఆమెకు అర్థంకాలేదు. ఆమె తన స్థితిని ఒకసారి పర్యాలోకనంచేసి చూసు కున్నది. చాలా శోచనీయంగావున్నట్లు తోచింది. తండ్రి ఎప్పుడో చిన్నప్పుడే పోయాడు. తల్లి ఉండేది. కూతురుమీద ఎన్నో ఆశలు పెట్టుకొని కలలు కంటూ వుండేది. కూతురుకి యీ వ్యాధి రావటంతో ఆమె సుందరస్వప్నాలు ఎక్కడికూడ విడిపోయినై. ఆ దెబ్బతో ఆమె కోలుకోకుం డానే పోయింది. ఇటువంటి విధి దుర్భరంగా తోచింది ఆమెకు. విజయలక్ష్మి ఆలోచిస్తూనే ఉన్నది. ఈ ఆలోచనే ఆమెకు దిగులుగా పరిణ మించి కృంగదీస్తున్నదనే విషయంఆమె తెలుసుకో గలిగితే ఎంతబాగుంటుంది!

రాజారావుకు విజయలక్ష్మితో మాట్లాడే అవ కాశం కొన్నాళ్ళకు కాని లభించలేదు. ఈమధ్య ఆమె కన్పించినా, ఆమెవెంట ఎవరో ఉండేవారు. అటువంటప్పుడు ఆమెనుచూసి కేవలం చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయేవాడు. మొదట ఆమెకు కొంచెం కష్టంగా వున్నట్లనిపించేది అతనితీరు. కాని ఎప్పుడు చూసినా చిరునవ్వు నవుతుండే అతనిని చూస్తుంటే ఆమెకు ఒకవిధమైన ప్రసన్నత కలిగినట్లుండేది.

ఒకసారి రాజారావు షికారు వెళ్ళి వస్తుంటే ఆపరేషన్ బ్లాకువైపునుండి వస్తున్న విజయలక్ష్మి కన్పించింది. అతనిచూసి ఆమె అప్రయత్నంగా మందహాసం చేసింది. రాజారావుముఖం వికసించి నట్లయింది.

"ఆరోగ్యం ఎలావున్నది?" అని అడిగాడు.

"చాల బాగున్నది." అన్నదామె.

"కేవలం అతిశయోక్తి! ఇదివరకటికంటె కొంచెం 'లైట్' వచ్చినట్లు కన్పిస్తున్నారు. అంతే కాని, చాల బాగుండేంతటి ఆరోగ్యం మీకింకా కలగలేదు. అయినా మీకు నిర్లక్ష్యం చాల ఎక్కువగా ఉన్నట్లు కన్పిస్తున్నది."

"నిర్లక్ష్యం దేనిని గురించి?"

"మిమ్మల్ని గురించే. మీరు ఆరోగ్య విషయంలో అంత శ్రద్ధ తీసుకుంటున్నట్లు కన్పించదు. ఎప్పుడూ ఏదో విచారిస్తూ కూర్చుంటారు. ఈ వ్యాధికసలు విచారం అనేది పనికిరాదు. డాక్టర్గనా మీ యింటికి ఉత్తరంవ్రాసి మీ నాన్నగారికి తెలియజేస్తే బాగుండేట్లున్నది. వారన్నా వచ్చి..."

రాజారావు వాక్యం పూర్తి చేయకుండానే ఆమె ముఖభావాలుచూసి ఆశ్చర్యపోయాడు మళ్ళా ఆమెముఖం విషాదఛాయలతో మ్లానమైంది. వాళ్ళనాన్న గురించి ఏదో అంటుంటే ఆమె హఠాత్తుగా బాధపడటం అతనికేదో స్ఫురింప జేసింది.

"క్షమించాలి. నా మాటలు మీకు కష్టం కలిగిస్తవనుకోలేదు. చాల విచారిస్తున్నా"నన్నాడు బాధగా.

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ నడుస్తున్నారు. వచ్చేపోయే పేషెంట్లు కొంతమంది, వీరిద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తు అసహ్యంగా చేతులు తిప్పుకుంటు వాళ్ళలోవాళ్ళు ఏదో మాట్లాడుకుంటూ పోతున్నారు.

"మీకింత విచారం ఎందుకో చెప్పరూ..." అతని కంఠస్వరం జాలిపుట్టిస్తుంది.

విజయలక్ష్మి అతనివైపు చూసింది. అతని ముఖాన బాధతోకూడిన హాసరేఖ అస్పష్టంగా కన్పించింది. అతను ఆమెకళ్ళలోకి చూస్తూ "చెప్పరూ..." అన్నాడు గోముగా.

ఆమె కళ్ళలో నీళ్ళు నిల్చినై. తల అడ్డంగా తిప్పి "ఊహుఁ" అంటూ చకచక నడిచి వెళ్ళి పోయింది.

రాజారావు అలాగే ఆమెను చూస్తూ నిల్చుండి పోయాడు. ఎంతప్రయత్నించినా ఆమె కొరకు బాధపడకుండా ఉండలేకపోయాడు. తన ఉపాయంతో ఎలాగైనా ఆమె విచారాన్ని పోగొట్టగలననుకున్నాడు.

మళ్ళా వారంరోజులవరకు విజయలక్ష్మి అతనికి కన్పించలేదు. ఒకరోజు క్లబ్బుసమీపంలో కన్పించింది. రాజారావు ఆమెను సమీపించటం చూసి త్వరత్వరగా నడచి వెళ్ళిపోయింది. ఏ కారణం వలన అయినప్పటికి, ఆమె రాజారావునుండి తప్పించుకోవాలని ప్రయత్నించినట్లుడూహించాడు. ఒకవేళ ఆమెను కలుసుకున్నా ఇదివరకటి మాదిరిగా సంభాషణ జరిపే అవకాశం ఉండదేమోనని ననిపించింది.

ఆ మర్నాడు డాక్టర్ రాజారావును 'డిశ్చార్జి' చేశాడు. తనసంకల్పం నెరవేరకుండానే, ఆమె విచారం పోగొట్టకుండానే వెళ్ళవలసి వస్తుందేమో ననిపించిందతనికి. ఎలాగైనా ఒకవారం లోపల ప్రయత్నించి తనపథకాన్ని అమలుపర్చి ఆమె విచారాన్ని పోగొట్టాలనుకున్నాడు.

ఆ సాయంకాలం విజయలక్ష్మి కన్పిస్తుందేమో నని నాలుగు వైపులా తిరిగాడు. రోడ్డుమీద నడచిపోతుంటే ఎడంప్రక్కనున్న గ్రౌండులో వేపచెట్టుక్రింద బెంచీపై కూర్చునిఉన్న విజయలక్ష్మి కన్పించింది. ఆమెను సమీపించాడు. ఇటు వైపు వీపుచేసి కూర్చుని ఏదోపుస్తకం చూస్తున్నది. ఈ సమావేశంతో తన పథకాన్ని అమలుపరచి విజయం పొందాలనుకున్నాడు.

"లక్ష్మీ" అన్నాడతను. అతని స్వరం కంపించింది. ఆ కంపనం వలన కంఠంలో ఆర్ద్రత ఉన్నట్లు స్ఫురించింది.

ఆమె తలెత్తి చూసింది. లేవబోతుంటే అతను వారించాడు. ఆమెసమీపంలోకెళ్ళి నిల్చున్నాడు.

"నామీద ఎందుకింత కోపం లక్ష్మీ?" అతనామెను పేరుతో పిల్చే విధానం చాలాచిత్రంగా వున్నట్లున్నది. ఆమె కొంచెం తడబడింది.

"ఇక నావలన ఏమీ కష్టం కలగదు. నేను త్వరలోనే వెళ్ళిపోతున్నాను లక్ష్మీ!" మళ్ళా అతని కంఠస్వరం ఆర్ద్రమయింది.

విజయలక్ష్మి జాలిగా అతనివైపు చూసింది. అతని ఏకవచన సంబోధనలోని అనౌచిత్యం ఆమెను

తట్టలేదు. ఆనాదినుండి అత నలాగే పిలుస్తున్న ట్లనిపించింది.

"నేనేం తప్పుచేశానని ఆ రోజు నన్ను చూసి కూడా మాట్లాడకుండా వెళ్ళిపోయావు...చెప్పు లక్ష్మీ. నీ క్షేమాన్ని కాంక్షించటమేనా నా తప్పు? నీవు దిగులుపడటం చూసి బాధపడటమేనా నేను చేసిన అపరాధం? చెప్పు లక్ష్మీ. ఆ రోజు నే నెంత బాధపడ్డానో తెలుసా'' అతని మాటల్లో అతని బాధ వ్యక్తమవుతున్నది.

ఆమె చలించిపోయింది. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నయి.

"నేనొక దురదృష్టవంతురాలిని. నాకొరకు మీ రెందు కంత బాధపడటం. మీరు ఇంతగా చూపిస్తున్న సానుభూతిని నే నెలా సహించగలను?" గద్గదికంగా అన్న దామె.

"పిచ్చి లక్ష్మీ. ఇది కేవలం సానుభూతి కాదు. ఆ దశను అధిగమించింది. ప్రపంచంలో చాలా మంది దుఃఖితులున్నారు. వాళ్ళందరినీ ఓదార్చే వారు వుండరు. ఒక్కొక్కచోట అలా జరుగుతుంది. ఒకరి దుఃఖానికి ఇంకొకరి హృదయం స్పందిస్తుంది. ఇది సామాన్య దృష్టికి అర్థంకాని అలౌకిక సంబంధం. నీవు అనవసరంగా విచారించ వద్దు లక్ష్మీ. కనీసం నాకొరకు, పరిస్థితు లెలాంటివైనా జీవితంలోనుండి ఆనందాన్ని పిండి దాన్ని ఆస్వాదించటం నేర్చుకోవాలి. దిగులుపడుతూ కూర్చుండటంవలన ప్రయోజనంలేదు. ఇదిగో ఇది మా అమ్మ ఉంగరం. దీనిని నీవు అగౌరవపర్చవద్దు. నేను రేపే వెళ్ళిపోతాను. నెలకొకసారి క్షేమాన్ని కాంక్షిస్తూ ఉత్తరంవ్రాస్తాను"అంటూ తన చిటికిన వేలునున్న ఉంగరంతీసి లక్ష్మీ చెయ్యి పుచ్చుకుని ఆమె వేలికి తొడిగాడు. అలాగే ఆమె చేతిని మృదువుగా పెదవులకు హత్తుకున్నాడు.

"శలవులక్ష్మీ, నన్ను మర్చిపో" అంటూ వేగంగా చేతిగుడ్డతో కళ్ళు తుడుకుంటూ వెళ్ళిపోయాడు.

విజయలక్ష్మి మంత్రముగ్ధ మాదిరిగా నిశ్చేష్టురాలై అలాగే రాజారావు వెళ్ళినవైపు చూస్తూ ఉండిపోయింది. అతను అదృశ్యుడవంగానె వేలికున్న ఉంగరంవైపు చూసింది. చిన్న వజ్రంతో వున్న ఉంగరం. అందంగా ఉన్నది. ఆ ఉంగరాన్ని చూస్తూ కూర్చున్న ఆమె ముఖాన వింతకాంతి ఏర్పడింది.

రాజారావు ఒక ఘనకార్యం సాధించిన తృప్తిలో మర్నాడే బండెక్కాడు. అంత ఖరీదు చేసే ఉంగరం పోగొట్టుకున్నందుకు విచారం కలగక పోయినా ఉంగరం విషయంలో అలా అబద్ధం చెప్పినందుకు కొంచెం కష్టమనిపించింది. అయినా ఆమె కొరకేనసే సంతృప్తి సాంత్వనపర్చింది. ఆమె చేతికా ఉంగరం ఉన్నంతకాలం ఆమె పిచ్చిపిచ్చి ఆలోచనలతో, నిరాశతో, బాధపడుతూ విచారించవలసిన అవసరం ఉండనుకున్నాడు.

రాజారావు అనుకున్నట్లుగానే ఆ సంఘటన ఆమెలోని రసావిర్భావానికి తోడ్పడింది. ఆనాడు ఆమె ముఖాన ప్రకాశించిన కాంతి ఏనాడూ తగ్గలేదు. ఆ ఉంగరం తత్సంబంధస్మృతి ఆమెలో నూత్న ఉత్సాహం నూత్న స్ఫూర్తి ఏర్పర్చి త్వరగా ఆమె ఆరోగ్యం పొందే అవకాశాన్ని కల్పించినై!

నాలుగు నెలల తరువాత రాజారావుకొక ఉత్తరం వచ్చింది విజయలక్ష్మి దగ్గర్నుండి. దానిలో—"లోభివాడు తన చిరసంచిత ధనాన్ని ఎంత జాగ్రతగా దాచి కాపాడుకుంటాడో అంత కన్నా జాగ్రతగా నాకు లభించిన మధురసంపత్తి హృదయంలో దాచుకొని కాపాడుకొంటున్నాను. సరేకాని నేను ఏ సంపత్తిని నైతే జీవితాధారంగా స్వీకరించి భవిష్యజ్జీవితాన్ని గడపాలనుకుంటున్నానో ఆ సంపత్తి నిచ్చిన వారిని మర్చిపోవటం ఎలాగో కొంచెం నేర్పుతారూ?

మీ ఆశీస్సు సగం ఫలించింది ఇవ్వాళే ఇంటికి వెళ్తున్నాను" అని వ్రాసిఉన్నది.